# పందెం

హోరుమంటూ గాలి. దిక్కులేని ఆడమనిషి ఏడుస్తున్నట్టు ఉండి వుండి వర్షం; నిర్లక్ష్యంగా పిడికెడు బియ్యం బిచ్చం వేస్తున్నట్టు.

కొంపంతా ఆర్పుకుపోయి చివరకి ముష్టెత్తుకోవటం తప్ప మరో గత్యంతరం లేదని నిర్ణయాని కొచ్చేసిన మనుషుల్లా కొబ్బరిచెట్లు- గాలి వాలుకు ''ఫటఫట'' మని విరిగిపోతాయేమో ననిపించేలా వంగుతున్నాయి.

పగలంతా తిరిగినా జోలెలో ఒక్కగింజ పడని ముష్టివాళ్ళ మనసుల్లా పక్షులు విలవిలలాడిపోతున్నాయి.

యాచన - చతుష్షష్టి కళలలోనూ ఒక కళ అయితే గియితే మాత్రం - ఆ సత్రం చాలామంది కళాకారులకు నిలయం.

కొత్త ముష్టివాడిలా ఆ సత్రం వూరికి దూరంగానూ, పురుగులు తినేసిన ఆనపకాయలా శిధిలావస్థలోనూ ఉంది.

''నాదీ, నా ప్రజలదీ ఒకేరకం అభిరుచి'' అని దేశం గర్వంగా చెప్పుకుందు కక్కడ చాలా మంది ఓటుంటే తెలీని పౌరులు న్నారు. కేసుల కోసం తడుముకోనక్కరలేకుండా పోలీసులకి అక్కడ మనుషుల్లాంటి వాళ్లు దొరుకుతారు.

''సింకి జోలెకన్నా సింకి బొంత నయం'వన్నట్లు- ఇయ్యాల గడిసిందా? ఇక పల్లకతొంగో … మాపటికేటవుద్దా అనూరకే ఇదయితే ఏట్నాబం?'' అనే ఫిలాసఫీ వారిది.

రకరకాల రోగాలకీ, జాతులకీ నిలయమై ఆ సత్రం భిన్నత్వంలో ఏకత్వం సాధిస్తోంది.

చాలాకాలంనుంచి జబ్బుతో తీసుకుంటూ గడియో క్షణమో అన్నట్లు కొందరూ- ఇంకా మనుషుల మంచితనం మీద నమ్మకం సడలిపోనివారిలా కొందరూ ఉంటారక్కడ.

దేశం మొత్తం మీద ''యాచన'' ని నిషేధిస్తే ఏం చెయ్యడమో తోచనక సతమతమైపోతున్నవాళ్ళలా కొందరు.

ముష్టివాళ్ళలో కూడా పది రూపాయల వరకూ అప్పిచ్చి వడ్డీకి త్రిప్పగలిగే బాపతు వాళ్లుంటారని తెలీని వాళ్ళకి 'నరిసింగు' ఒక ఆశ్చర్యార్థకం కావచ్చు.

వాడికన్నా వాడిడొక్కే బావుంటుంది. వాడి శరీరంకన్నా వాడి చింకి బొంత బాగుంటుందనక

తప్పదు వాడి రాబడికన్నా వాడి పెళ్లాం రాబడే హెచ్చు. దాని పేరు సత్తిరాజు.

ఆ సత్రంలో వాళ్ళకి ఓ కొన్ని తీరని సందేహాలున్నాయి.

(1) సత్తిరాజు ముండ నరిసింగుగాడ్ని ఏం చూసి మనువాడింది? ఆడ్నే కనిపెట్టుకుని ఎందుకుంటాది?

(2) ఈ నరిసింగు నాయాలగాడుకొంప దీసి ఆడిబొంతలో డబ్బు దాచుంచలేదు కదా?

(3) నెగిసిపోదాం రమ్మంటే సత్తిరాజు ఎటంటుంది?

సత్తిరాజుకేం తక్కువ?

రోగంవా, రొష్టా! వయసు తీసుకొచ్చిన అందంతో ''గజ్జెల గుర్రం నాగుంటది.'' అది గోనె పరిచి కూకుంటే- డబ్బులు! డబ్బులు! కళ్ళు జిగేల్మనిపోవాల! అది సంపాదించబట్టే నరిసింగు ''సీకూ సింతానేక మారాజు కొడుకు నాగా'' బతికేస్తున్నాడు.

నరిసింగుకే జబ్బు లేదో పోల్చుకోవటం కష్టం. వాడు గుట్టు చప్పుడు కాకుండా ఏ రాత్రో గుటుక్కుమనేస్తాడంతే. వాడిని చూసిన ముష్టివాళ్ళ క్కూడా తిండి సయించదు.

''మరాడ్ని సత్తిరాజు ఎందుకు పట్టుకుని ఏలాడుతోందో? సత్తిరాజుకేం పిచ్చా? కాదెంత మాత్రం కాదు. నీ డొక్కూ డోలూ లాక్కుని నీచేతే వూడిగం చేయించుకోగల్దు.

కాని సత్తిరాజు నరిసింగుని వొదల్దు; వాడ్ని ముదనష్టపు రోగాలేవీ వొదలనట్టు.

పైన చెప్పిన సందేహాలు అందరికన్నా ఎక్కువగా పీడిస్తున్నది గురువుల్ని. వాడక్కడ చాలా మందికి గురువు. వాడికి ''బెమ్మాండవయిన నోక గ్యానం'' ఉంది. ఎడార్లో పడేసినా ఆ పూటకి నాస్తా దండుకొచ్చీగల్దు! ఓ కన్ను గుడ్డి, అయితేనేం? ''అదే వుంటే పెపంచకాన్నే ముంచీద్దుడు.''

వాడి వాగుడు వారికి ఉపన్యాసం.

ఇయ్యాల మూడు లాంతర్లకాడ ఓ బాబు ''కూలి సేసుకోరాదా నక్కునాగున్నావ్?'' అన్నాడోరే ఎర్రాడా! ''అందరూ కూలిపనులకెగబడితే పన్లుండొద్దేటి- ఇప్పటికే సత్తన్నారు పెజలు. అని పాయిుటినాగేనోరే అయిందా? ఆ బీడీ ముక్కందుకోసెప్తాను. దాంతో ఆ బాబు మళ్ళీ మాటాడకుండా పోనాడు... ఆ బాబూ పని దొరక్క తిరుగుతున్నోడే కాబోలు...'' అంటూ భళ్ళున నవ్వుతాడు. వాళ్ళు పొట్టలు చెక్కలయిపోయేట్లు నవ్వుతారు.

''అమెరికాలో ముప్పైత్తుకోటి మందే ఏటనడుగుతారు- తెల్చా... డబ్బు సంపాదించాలన్న యావ ఎంతుంటదో- దాన్ని కర్సెలా పెట్టాలా అన్న ఆలోసని అంతుంటుందక్క డోళ్ళకి, అమెరికా- ఏటలా ఎదవ ముకవెట్టావు? అమెరికా అంటే మనూరి బందుల దొడ్డినా గుంటదనుకున్నవేటి? అక్కడ పెతీవోడికీ ఓ కారుంటుంది. ఇక్కడ పెతీ మగపురుసుడికీ ఓ పెళ్ళాం వున్నట్టు-' అంటూ ఆగుతాడు.

ఆడదాని వూసెత్తితే చాలు- వాడికి సత్తిరాజు గుర్తొస్తుంది. నరసింగు చస్తే. ఆశ్రయించడానికి తనుతప్ప దానికి మరొకడు లేడని ఆడికి బాగా నమ్మకం.

''పెళ్ళాడితే పోషించాలి. సేదంటే మీసం తిసేసి కూర్చోవాలంతే. ఆడదాని డబ్బుమీద బతికే

వాడిదీ ఓ జన్మమేనా?'' అంటూ నరిసింగు మీద ఓ విసురు విసురుతాడు.

ఆ మాట నరిసింగుకి బల్లెంలా గుచ్చుకున్నప్పటికీ గురువులుతో తగూ పెట్టుకోడు. అందుకో రెండు కారణాలున్నాయి.

(అ) గురువులు నోరు మంచిదికాదు. ఆడితో తగువాడితే ఆడేటి పేల్తాడో ఆడికే తెలీదు.

(ఆ) గురువుల్దగ్గర చిలుంగొట్టముంది? దాన్ని పీల్చడంలో ఆ పూట తిండికిపోగా నేలగేటు సినిమాకి డబ్బులు మిగిలినంత ఆనందంగా ఉంటుందని వాడి నమ్మకం.

తన చిలుంగొట్టాన్ని ''పెర్మినెంటుగా'' నరిసింగుకి ఇచ్చెయ్యడానికి గురువులు ''లెడీగానే'' ఉన్నాడు. కానైతే అందుకో రెండు షరతులున్నాయి.

(క) సత్తిరాజుని తనకి వొప్పచెప్పియ్యాలి.

(గ) నరసింగు దగ్గరున్న బొంత ఎలా గున్నదలా ఇచ్యెయ్యాలి. (అందులో ఎంత డబ్బుందో?).

2

భోరుమంటూ కురిసిన వర్షం సాయంత్రం ఆరుగంటలక్కానీ తగ్గలేదు. అప్పటికి అక్కడున్న ముష్టివాళ్ళకి అగ్గిరాజెయ్యడానికి తెరిపయింది. అన్నం ముద్దలుదొరికినవాళ్లు మాత్రం అది తినియిన్ని నీళ్లుత్రాగేరు. కూడు తిన్నాక పెళ్ళాలున్న వాళ్ళు తలో మూలకీ చేరుకున్నారు.

గురువులికి కడుపు నకనకలాడిపోతోంది. వర్షం మొదలయిన దగ్గరనుంచీ అనర్గళంగా వాగాడేమో, వాడిగొంతు ఆర్చుకుపోయింది. మధ్యాహ్నం దొరికిన చిల్లర డబ్బులతో పకోడీలు కొన్కుతిని టీనీళ్లు తాగేడు. తతిమ్మాదానితో చిలుంగొట్టంలోకి పొగాకు సామానుకొన్నాడు. ఓసారి దమ్ముకొట్టాలనుంది కానీ- కడుపు కొంచెం చల్లబడాలి ముంది.

''సచ్చినెదవలు ... వొకడూ పిల్చియింత కూడెట్టడు సూడు ... దొంగ నాయాలు ... ఏటేనా కబుర్లాడతాను రండ్రా అంటే సంకలు గుద్దుకుని మరీ వొస్తారు... సీ! కుక్కెదవలు!'' అనుకున్నాడు.

హఠాత్తుగా వాడికా సత్రం చాలా యిరుకైపోయినట్లనిపించింది. తన గొప్పని అర్థం చేసుకోగల వాడెవడూ ఆ ముష్టిఎధవలలో లేడనిపించింది: ''అందుకే ఈళ్ళ బతుకులిలా రోగాల్తో తగలడుతున్నాయి'' అని కూడా అనుకున్నాడు. వెంటనే ఆ సత్రవులోంచి మకాం మార్చేసి ''విశాల భూప్రపంచం'' లోకి వెళ్ళిపోదామా అనుకున్నాడు.

కాని -

విశాల భూప్రపంచంలో లైట్లు లేవు. చిమ్మ చీకటిగానూ, అతి భయంకరం గానూ ఉంది. అంతా బురదమయంగా వుంది. వర్షం మళ్ళీ ముంచుకొచ్చేటట్టుంది.

''హు! ఈ రేత్తిరిక్కడే తొంగోవాల'' అని బరువుగా నిట్టూర్చాడు గురువులు, నిద్రకన్నా ఆకలి మొదటి సమస్య కనుక చిరచిరలాడుతూ సత్రవులోనే తిరుగుతున్నాడు.

అటూ ఇటూ చూడ్డంలో వాడి దృష్టి అటువేపు ఓ మూల పడుకున్న ఆకారాల వేపు పడింది. పట్టిపట్టి చూశాడు.

వాడెవడు చెప్మా నరిసింగుకాదూ? అప్పనప్పుడు నరిసంగే! ఎదిగో! సత్తిరాజు! వాడు పర్కాన జెర్రిపోతులా మెలికలు తిరిగిపోతూ! ''దీని వొగలు కుక్కల్తోలా- ఏటా యిరగవాటూ నవ్వులూనూ!'' గురువులుకి కడుపు మండిపోయింది, ఆకల్తో నకనకలాడిపోయేడు.

ఆకలి. ఆకలి.

సత్తిరాజుని నంవిలి మింగెయ్యాలి.

* * *

గురువులు అటు రావడం చూసి, సత్తిరాజుని ప్రక్కకి తోసి ''రారా గురువులూ! రా! ఏటి... ముద్దతిన్నవైందా?'' అనడిగేడు. గురువులు వెళ్ళి వాళ్ళ పక్కన చతికిలబడ్డాడు. వుడిపీ హోటలు ముందు అడుక్కుంటే పకోడీల వాసనంతా మనదే అయినట్టు- దగ్గరకెళ్తే సత్తిరాజు ఆడగాలి మరీ యిదిగా పీల్చొచ్చును.

గురువులు మాట్లాడక పోవటంవల్ల మళ్ళీ అడిగాడు. నరిసింగు ''మాటాడవేంటి... మంది బొక్కడం నాగా... ముద్ద దొరక నేదేటి?'' అన్నాడు ఆశ్చర్యం వెలిబుచ్చి. గురువులుకి ముద్దదొరక్కపోవటం ఆశ్చర్యమా? ఆశ్చర్యంనరా?!

గురువులకి అభిమానం లాంటిది అడ్డొచ్చింది. ''అల్లక్కడెక్కడో ఓ యమ్మ ముద్ద ఎడతానన్నుండే అకల్లేక వొద్దన్నాను మద్దేనం... యిప్పుడాకలి దంచేస్తోంది... పైసలున్నాయికాని ఏటాలాం? సరం గుమ్మం దిగేమా, ఏ నూతిలో పడతాంవో? ఏ పులెత్తుకుపోద్దో... అన్నంత సీకటిగుంటే'' అని నిట్టూర్చాడు.

నరిసింగుకి జాలేసింది.

''అదేంట్రా గురూలూ - అందుకని డొక్క మాడ్చుకుని తొంగుంటావేటి? మనంవూ, మనంవూ ముష్టోళ్ళం... ఇయ్యాల నీకు పస్తయితే రేపు నాకు. ఒకరి కొకరం తోడుగా వుండాల... సర్లే... ఈ రేతిరికి సత్తిరాజు కాస్త కూడొండి పెడతాదిలే... ఈ సీకటిని బడి ఎక్కడి కనిపోతావు... కూకో'' అని ''నెగు... నెగే... అన్నకి కసింత సాపాటు సూడు'' అంటూ సత్తిరాజుని పురమాయించేడు. సత్తిరాజు అయిష్టంగానే లేచింది. నరిసింగూ, గురువులూ కబుర్లలో పడ్డారు.

* * *

కబుర్ల మధ్య గురువులు దగ్గరున్న చిలుంగొట్టం ప్రసక్తి వచ్చింది. ''కూడు తిన్నాక ఓ దమ్ము కొడదాంనేరా'' అన్నాడు గురువులు. నరిసింగు పరమానందభరితుడయ్యాడు.

సిల్వారు పళ్ళెంలో కూడెట్టింది సత్తిరాజు, రెండు ''పిండొడేలు'' కూడా పెట్టింది. కడుపు చల్లార్చుకున్నాక మూతి పైమీది గుడ్డతో తుడుచుకుంటూ నరిసింగు పక్కకొచ్చి కూచున్నాడు గురువులు.

ఆ తరువాత జోలెలోంచి చిలుంగొట్టం బయటికి తీశాడు. దానిగురించి వాడు చెప్పిందంతా కళ్ళు మిటకరించకుండా చూస్తూ విన్నాడు. గురువులి చేతిలో చిలుంగొట్టం ఆ సమయంలో అమృతభాండంలా కనిపిస్తోంది నరిసింగుకి. అంతవరకు 'గంజాయిదమ్ము' లోని 'రంజు' గురించి వినడమేకానీ తనెప్పుడూ

పీల్చలేదు. అదొక ఆశ్చర్యం. అదొక కల.

సత్తిరాజు ముఖం చిట్లించుకుంది. ''అసలే మావకి వొంట్లో వూపిర్నేదు.. ఈ పొగ ఆడికేటి పడుద్ది'' అనుకుని- 'సాల్లే సంబడం... మింగమెతుకు నేదుగానీ మీసాలకి సంపెంగ నూనెట... మన బతుకులకీ గంజాయిదమ్మొక్కటే తక్కువొచ్చిందిగానీ నెగు. నెగు.. తొంగొవాల' అంది చీరకొంగు పర్చుకుంటూ.

నరిసింగుకి దాని మాటలు తలకెక్కలేదు. ''పల్లక తొంగోయే నువ్వు-'' కూడెడతాను రారా అంటే కూరుందా అనడిగేట్ట...'' నీకేటి తెల్సు దీని మజా'' అని కొట్టిపారేశాడు దాని మాటలు.

గురువులు కొబ్బరిపీచు చిలుం గొట్టం మూతిలోకి తోసి అంటించాడు. గొట్టాన్ని గుప్పిట నడుమ బిగించి పట్టుకుని మాంచి ఫోజులో ఒక్క గుక్క పీల్చి ''ఇది కదాస్వర్గం'' అన్నట్టు తల ఎగరేశాడు.

నరిసింగుకి మరి వుండబట్టలేదు. దాన్నందుకుని ఓ గుక్క బలంగా పీల్చి వుండచుట్టుకుపోయేడు. ఆ పొగ లోపలికెళ్ళి మంటగా మారిపోయి గుండెని కాల్చేసిందా అన్నట్లుగా ఉక్కిరిబిక్కిరై పోయేడు.

గురువులు నవ్వేడు ''ఈడా నీ పెనిమిటి! పిచ్చి నెంజా! సుకపడాల్సిన నెంజకొజ్జాగాడితో నెగి సెల్లిపోయినట్లు - ఈడ్నిపట్టుకు దేబిరిస్తావేటి?'' అన్నట్టుగా వుందా నవ్వు.

దగ్గుతో చుట్టుకుపోతూనే పీల్చేస్తున్నాడు నరిసింగు. గురువులు వాడి దగ్గర నుంచి గొట్టం లాక్కున్నాడు. ''సరదా కొస్తే సగం సేసి పంపించేట్ట నీలాంటోడే..తే.. యింకా తాగితే వూపిరందక సత్తావుకూడానూ.. అసలే వొంటూపిరి గోడివి'' ఈ మాటలు సత్తిరాజు వినాలనే అన్నాడు గురువులు. సత్తిరాజు విందోలేదో కాని- వులకలేదు. పలకలేదు.

నరిసింగుకి - తనని వాడు బలవంతంగా నరకంలోకి తోసేసినట్లయింది. ఈ గురువులుగాడు తన కౌగిటిలోనుంచి బలవంతంగా సత్తిరాజుని లాక్కుపోయినట్లనిపించింది.

హుం. ఈ వొంటి కన్నుగాడు.. ఈ ఎదవనాయాలు.. తను కూడెట్టకపోతే ఇయాలరాత్రి ఆకల్తో మాడి సచ్చుండాల్సిన ఎదవ - తననెంత మాటన్నాడు! ఈడ్ని సంపెయ్యాలి. ముందీడి కాడ్నుంచి చిలుంగొట్టం లాక్కోవాలి.

''ఒస్సోపాలితేరా - దీన్ని తాగటం నీకొక్కడికే సాతనవుద్దనుకోకు-'

అప్పుడు గురువులు నవ్వేడా? వెక్కిరించేడా? రెండూ చేశాడు రవుడీ ఎదవ! నరిసింగుకి వొళ్ళు మండిపోయింది. వాడిచేతిలోంచి గొట్టం లాక్కోబోయేడు. గురువులు పట్టువదల్లేదు. 'తాగింది సాల్లేరా - అనుబగించ లేనోడికి ఆడదెందుకన్నట్టు- నీకెందుకురా ఇది - సాల్సాల్లే'' అని విరగబడి నవ్వేడు.

చిర్రెత్తుకొచ్చింది నరిసింగుకి.

సత్తిరాజు దగ్గర లోకువయిపోకూడదనుకున్నాడు.

అసహనంగా అరిచేడు ''నోర్ముయ్ నెమ్మిడే! నీకు కూడెట్టినందుకు మంచి ఇశివాసం సూపించావులే - కుక్కలకొడకా!''

గురువులకీ కోపం వచ్చింది. ''ముష్టి కసెల్తేముత్తెం దొరికినట్టు- ఏ జల్మంలో సేసుకున్నపుణ్ణెవో

కసింత మిగిలిపోయి - ఈడికీ జనమలో సత్తిరాజు దొరికింది కానీ- ఈడెంత? ఈ వికారోడు నన్నునడవేటి? మయానొచ్చిన అదురుష్టమూ - మద్దేన మొచ్చిన కలా నిజం కావంటారు. సత్తిరాజొగ్గేస్తే ఈడ్ని పాట్లు కుక్కలు పడవు నా కొడుకు! ఎంత మాటన్నాడు!' అనుకున్నాడు.

ఇద్దరికీ తగువు పెరిగి పెద్దయింది. సత్తిరాజు వారించబోయినా నరిస్సింగు తగ్గలేదు.

సత్తిరాజు ఎదుట ఓడిపోకూడదని వాడి పట్టుదల.

దాని ఎదుట నరిసింగుని చిత్తు చెయ్యాలని గురువులు కోరిక.

ఈ గలాభా విని, అప్పుడే నిద్రలోకి జారుతున్న ముష్టివాళ్ళంతా వచ్చి ఈగల్లా మూగేరు.

ఈ అవకాశం వొదులుకోదల్చలేదు గురువులు.

''సర్లే నీకూ నాకూ మద్దెన గొడవెందుగ్గానీ ఓ పందెం యేద్దాం.. సెప్తాయిను. దమ్మున్న మొగోడు మనిద్దరిలో- ఇరవై అంకెలు సెక్కెట్టే వరకు గుక్క వదలకుండా పుగ పీల్చాలి. ఓడినోడు మీసం తీసెయ్యాలి వారం రోజులు ముష్టికెళ్ళటం మానెయ్యాలి - ఏటలాగేనా? నా నోడిపోతే మాత్రం ఈ సిలుంగోటం నీకిచ్చేసి- 'సెభాస్ మొగోడా' అని మెచ్చుకుని మరీ ఎల్తాను. అలాగేనా? సెప్పుమరి...? అనడిగేడు నరసింగుని.

వాడు ''మొగోడు'' కాడని సత్తిరాజు ముందు ఋజువు చేసెలయ్యాలని తహతహలాడిపోతున్నాడు గురువులు.

ఈ పందెం వొద్దని నరిసింగుని సత్తిరాజు బతిమలాడింది. తిట్టింది. నయాన చెప్పింది. వాడు విన్లేదు. 'ఇయ్యాల పందేనికి నిలవకపోతినా - మాపటికి బతుకే మారిపోద్ది' అని వాడికి భయం పట్టుకుంది.

పందెం మొదలయింది.

అంకెలు ''పున్నయ్య'' లెక్క పెట్టడానికి నిర్ణయమయింది.

దగ్గూ, ఆయాసం - గర్వం, కోరిక కలసి హోరా హోరీగా పోరాడుకున్నాయి.

పందెంలో నరిసింగు ఓడిపోయేడని నేను చెప్పటం ''మేక-పులి'' పోరాటంలో మేక బలయిపోయిందని చెప్పినంత పేలవంగా వుంటుంది.

గురువులి ఆనందానికి అడ్డు లేకపోయింది.

3

గురువులికి కొండెక్కినట్లుంది. పందెంలో ఓడిపోయేక సత్తిరాజు నరిసింగు నెన్నితిట్లు తిట్టిందని! ''నీ జిమ్మడ. నీ మగతనం మంటగలవ! పందెం వొద్దురా మావా అంటే యినుకున్నావా ? పోనీ కాసేపు-గెలిశావా అంటే అదీసేదు- గొరిగించుకో మీసం- ఈ వారం రోజులూ ముష్టికెళ్ళకూడదని బెంగక్కర్లేదు. కదా- ఆడదాని కూడు తిండం నీకేం కొత్తేటి? సచ్చినోడా!''

నరిసింగు తల దాని తిట్లతో భూమిలోకి కుంచించుకుపోతూ వుంటే గురువులికి కొండెక్కించినంత గర్వమనిపించింది.

4

ఆ మర్నాటి సాయంత్రం

సంజ చీకట్లు ముసురుకుంటున్న వేళ-

సత్రపు వెనకాతల నూతి చప్టా దగ్గర-

"ఊఁ.. ఏటే సత్తిరాజూ... నీ మొగాడేటంటున్నాడు?" అని విలాసంగా అడిగేడు గురువులు- "మొగాడు" అన్నదగ్గర ఒత్తిపలుకుతూ.

ఏదో పనిచేస్తూ సత్తిరాజు పలకలేదు.

"హా! హా! ఏటంటాడులే- ఎంత పిచ్చి దానివే నువ్వు! ఆడివొల్ల ఏం సుకం పొరుగుతాదన్నెప్పి బల్లిలా అడ్నంటి పెట్టుకుంటన్నావ్?" అనడిగేడు.

అయిష్టంగానే జవాబిచ్చింది. సత్తిరాజు! "ఎందుకేటి? ఆహ్వానమా... జబ్బు పడిసీకదా అన్నెప్పి వొగ్గీమందామా? నేన్నేకపోతే ఆడెలా బతుకుతాడు? ఆడికి నేనూ- నాకాడూ అంతే."

[illegible]గబడి నవ్వేడు.

"[illegible]హా! హీ! ఆడ్ని గాలి కొగ్గీమని నానూ సెప్పనే.. కానీ.. నీ సుకాన్ని మాత్రం ఎందుకు గా[illegible]లంటాను.. ఏం? అందుకని.. వరస కాదూ.. సరసన్నేనూ ..." అంటూ ఆమె చెయ్యి పట్టు[illegible]డు.

వాడి చెంప చెళ్ళుమంది.

[illegible] అన్నప్పటిలా రెచ్చిపోయి సత్తిరాజు జబ్బపట్టుకుని మీదకి లాక్కున్నాడు గురువులు. పిచ్చెత్తిన మనిషిలా దాని జాకెట్టు ఫర్రుమంటూ చింపేసి గుండెలకి అదుముకున్నాడు. ఛళ్ళున ఏడుస్తూ కసిక్కున వాడి [illegible] కొరికి, తప్పించుకుని సత్రం వీధి గుమ్మంవేపు పరిగెత్తింది సత్తిరాజు. "దీనమ్మా" అంటూ బాధగా మూలిగేడు గురువులు.

* * *

ఆయాసంతోనూ, దుఃఖంతోనూ రొప్పుతూ పరుగెత్తుకుని వచ్చిన సత్తిరాజు ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి చేష్టలుడిగిపోయినట్లు స్తబ్ధురాలై నిల్చుండిపోయింది!

ఎదురుగా సత్రం అరుగుమీద...

ఉబ్బిపోయిన పొట్టతో, తేలిపోయిన కళ్ళతో, నీళ్ళోడుతూ- వికృతాకారంలో- నరిసింగు!

చుట్టూ ఈగల్లా ముష్టివాళ్ళు ...

సత్తిరాజు తెప్పుమంటూ కూలబడిపోయింది.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక. 25.5.1973)